షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక









సంపుటి : 1 సంచిక : 242 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 20 ఆగస్టు 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 240 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 31 july 2024 PAGES : 8 PRICE : 3/-


# మైండ్ గేమ్ పాలిటిక్స్



హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో భారత రాష్ట్ర సమితి విలీనం అవుతుంది. దానికి అనేక కారణాలు ఉన్నాయి. మీరు చూస్తూ ఉండండి ఇది త్వరలో నెరవేరుతుంది.. బండి సంజయ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హోదాలో ఇటీవల చేసిన వ్యాఖ్యలు. ఆయన అలా మాట్లాడాడో లేదో.. వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు.. కెసిఆర్ తన పార్టీని బిజెపిలో విలీనం చేస్తారని, ఆయన గవర్నర్ అయిపోతారని, కేటీఆర్ కు ఏదో ఒక పదవి వస్తుందని, హరీష్ రావు తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడవుతారని అన్నారు. నిజానికి పై వ్యాఖ్యలు కింది స్థాయి నాయకులు చేస్తే పెద్దగా విలువ ఉండేది కాదు. వాటిని లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. ఆ వ్యాఖ్యలు చేసింది సాక్షాత్తు బండి సంజయ్, రేవంత్ రెడ్డి కాబట్టి పరిగణలోకి తీసుకోవలసిన అవసరం - మిగతా3లో



## బాలికకు అండగా సీఎం రేవంత్

- తల్లిదండ్రులను కోల్పోయిన దుర్గకు సీఎం రేవంత్ రెడ్డి బాసట
- బాలికకు విద్య, వైద్య, ఇతర అవసరాలకు అండగా నిలవాలి

హైదరాబాద్

ఆ చిన్నారి కష్టం పగవాడికి కూడా రాకూడదు. అప్పటి వరకు తల్లిచాటు బిడ్డగా ఎదిగిన ఆ చిన్నారికి ఒక్కసారిగా లోకం చీకటిగా మారిపోయింది. ఉన్న ఒక్క బంధం కూడా తెగిపోవడంతో ఒంటరిగా మిగిలిపోయింది 11 ఏళ్ల బాలిక. కన్న తల్లి చనిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బాలికకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "నేనున్నానంటూ" బాసటగా నిలిచారు. బాలికకు అన్ని విధాలుగా అండగా నిలవాలని కలెక్టర్‌కు సీఎం ఆదేశాలు జారీ చేశారు. - మిగతా3లో



## మరోసారి విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ

- ఈ నెల 23న జెలెన్ స్కీతో కీలక భేటీ
- రేపు, ఎల్లుండి పోలెండ్‌లో పర్యటించనున్న మోదీ
- అనంతరం ఉక్రెయిన్‌లో పర్యటన
- 30 ఏళ్ల తర్వాత ఉక్రెయిన్ కు భారత ప్రధాని

## అప్రమత్తంగా ఉండాలి



- మంకీపాక్స్‌పై సచివాలయంలో దామోదర రాజనర్సింహ సమీక్ష
- తెలంగాణలో కేసులు నమోదు కాలేదన్న అధికారులు
- అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచన
- అవసరమైన మెడికల్ కిట్స్, మందులు అందుబాటులో ఉంచాలని సూచన
- గాంధీ, ఫీవర్ ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలన్న మంత్రి

హైదరాబాద్

తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంకీ పాక్స్‌పై వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ, చెన్నైలలో మంకీ పాక్స్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన అధికారులతో ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. తెలంగాణలో ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అధికారులు... మంత్రి దృష్టికి - మిగతా3లో



## సీఎం సిద్దరామయ్యకు తాత్కాలిక ఉపశమనం

- గవర్నర్ ఆదేశాలను నిలిపివేయాలంటూ సీఎం సిద్ధరామయ్య హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు
- ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దు

## రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా?

- ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించడం సిగ్గుచేటు
- పోలీసు యాక్ట్ పేరు చెప్పి, జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు హుకుం జారీ చేయడం హక్కులను కాలరాయడమే
- ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నారు.
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం



హైదరాబాద్

రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా అని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించడం సిగ్గుచేటని విమర్శించారు. రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియచేస్తున్న రైతులను అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసు యాక్ట్ పేరు చెప్పి, జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు హుకుం జారీ చేయడం హక్కులను - మిగతా3లో

# కబ్జాలో ఒకరు పాస్ బుక్ లో మరొకరి పేరు...

**ధరణి తప్పిదం వల్ల తన సొంత భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి గుండిగ జోసఫ్**

షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి ఆగష్టు 19 యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డ గూడూరు మండలం గోవింద పురం గ్రామానికి చెందిన గుండిగ జోజప్ప తండ్రి తానయ్య అలియాస్ జోసెఫ్ విలేఖరుల తో మాట్లాడుతూ 16.02.2022 న తిప్పాబత్తినిన బాలశౌరి నుండి కంచనపల్లి గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 482 లో 3.01 ఎకరాల ఒక గుంట కొనుగోలు చేశాను. ఇదే సర్వే నెంబర్ లో 2018-19 సంవత్సరంలో ధరణి తప్పిదం వలన బోరంపేట బాలరాజు కు ఉండవలసిన భూమి బౌరోజు దుర్గాప్రసాద్ కు ధరణి ఆన్ లైన్ లో నమోదు అయినదని ఆ భూమి అతనిది కాదని రేపాక డి గ్రామానికి చెందిన చిప్పలపల్లి మహేందర్ నాథ్ మా భూమి తనదని 22.09.2022 లో అడ్డగూడూరు తహసిల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఆ భూమికి హద్దులు నా భూమి పై ఉన్న హద్దులు ఒకే విధంగా నమోదు చేసుకొని తనను తన భూమి లోకి పోకుండా అడ్డు తగులు తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేసి ఐదు ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేశారు. నేను లింకు దస్తావేజులు తో రామన్నపేట కోర్టును ఆశ్రయించగా భూమి పరిష్కారం అయ్యేవరకు శాశ్వత ఇంజక్షన్ ఆర్డర్ మంజూరు చేశారు. అప్పటి నుండి నేను భూమి పై కబ్జా కలిగి ఉన్నాను. పోలీసు అధికారులు ఇద్దరినీ పిలిపించి లింకు దస్తావేజులు ఇవ్వమని కోరగా 1954 సంవత్సరం నుండి లింకు దస్తావేజులు సమర్పించాను. మహేంద్ర నాథ్ మహేంద్ర నాథ్ 2018 -19 లో బేషరాజు సత్యనారాయణ తండ్రి రాఘవ రావు నుండి బౌరోజు దుర్గ ప్రసాద్ కి సాదా బైనమా ద్వారా రిజిస్ట్రేషన్ అయిందని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి పోలీసు వారికి సమర్పించారు. 2007 సంవత్సరం తర్వాత బేషరాజు సత్యనారాయణకు సర్వే నెంబర్ 482లో ఎటువంటి భూమి లేదని సమాచార హక్కు చట్టం ద్వారా తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేయగా 2018 19 లో దుర్గాప్రసాద్ కు ఎలా సాదా బైనామా చేశారని వివరణ కోరగా దానికి సంబంధించిన ఆధారాలు ధ్రవపత్రాలు కార్యాలయంలో లభ్యంగా లేవని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో తప్పుడు సాదా బైనామ ధ్రువపత్రాలు ఇచ్చారని ఆ సాధాబైనామపై సంతకం చేసిన రెవిన్యూ అధికారులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అప్పటి తహశీల్దార్ సలీమోద్దీన్ ఆ ధృవపత్రంపై ఉన్న సంతకం తనది కాదని ఎవరో తన సంతకాన్ని ఫోర్జరి చేశారని అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వివరణ ఇచ్చారు. దుర్గాప్రసాద్ ను వివరణ కోరగా అట్టి భూమి తనది కాదని బేషరోజు సత్యనారాయణ నుండి తనకు ఏలాంటి రిజిస్ట్రేషన్ కాలేదని వ్రాతపూర్వకంగా పోలీసు వారికి వివరణ ఇచ్చారు. దీనికి సంబంధించిన సమాచారం తన దగ్గర ఉందని జోజప్ప తెలిపారు. తన భూమిని పై అధికారులు రెవిన్యూ శాఖ పోలీస్ శాఖ వారు ఈ భూ వివాదాన్ని పరిష్కరించి తనకు తగిన న్యాయం చేయాలని గుండగ జోజప్ప తండ్రి తానయ్య అలియాస్ జోసెఫ్ కోరారు.



# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి ఆగస్టు 19:** మెట్ పల్లి మార్కండేయ మందిరంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా మార్కండేయ స్వామి పల్లకి సేవ ఊరేగింపు మార్కండేయ మందిరం నుండి ఓంకారేశ్వర ఆలయం వరకు ఊరేగింపు గా వెళ్లి పురోహితులు సంతోష్ వేదమంత్రాలతో ఓంకారేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మార్కండేయ మందిరం ఆలయంలో జంజరాల పండుగ కార్యక్రమం జరిగింది అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు ద్యావనపల్లి రాజారాం ప్రధాన కార్యదర్శి భీమ నాతి సత్యనారాయణ క్యాషియర్ బేతు భాస్కర్ ఉపాధ్యక్షులు శంకు ఆనంద్ సాంబారి ప్రభాకర్ ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ గుంటుక



గౌతమ్ వడ్డేపల్లి చిన్నయ్య కట్టెకోల శివరాజం భూపతి ఆడెపు శివాజీ చిలివేరి శ్రీనివాస్ గణేష్ దుర్గ చిలివేరి ప్రసాద్ సతీష్ అడ్డగట్ల నర్సయ్య పట్టణ 24 వార్డుల సంఘం అధ్యక్ష కార్యవర్గం పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లిలో న్యాయవాది పి సంతోష్ పై దౌర్జన్యం చేసిన ఇన్ స్పెక్టర్ జమాల్ పై కేసు నమోదు చేసి విధుల నుండి తొలగించాలి

**న్యాయవాది సంతోష్ పై బోరబండ పోలీసుల వైఖరికి నిరసనగా కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదుల విధుల బహిష్కరణ**

**న్యాయవాదుల పై పోలీసులు చేస్తున్న దాడుల పై సి.ఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలి**

**బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి డిమాండ్**



**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో హైదరాబాదు ఆగస్టు 19:** కూకట్ పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న పి. సంతోష్ అనే న్యాయవాది పై బోరబండ ఇన్ స్పెక్టర్ జమాల్ పోలీస్ సిబ్బందితో న్యాయవాది ఇంటిలోకి దౌర్జన్యంగా చొరబడి బనియన్ లుంగీ మీదనే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అడ్వకేట్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదులు సోమవారం రోజున విధులు బహిష్కరించి కోర్టు ఎదుట ప్లకార్డ్స్ ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారని కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఒక ఇంటిలో కిరాయికి ఉంటూ కూకట్ పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న పి.సంతోష్ అనే న్యాయవాది తను ఇంటిలో ఉండగా బోరబండ పోలీస్ ఇన్ స్పెక్టర్ జమాల్ అనే పోలీస్ అధికారి అతని సిబ్బందితో తలుపులు తోసుకుంటూ ఇంటిలోకి ఆకారణంగా నిజానిజాలు తెలుసుకోకుండా దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ దూషిస్తూ ఆ న్యాయవాది ఎంత చెప్పిన వినకుండా బనియన్, లుంగీ పైనే అరెస్ట్ చేసి దౌర్జన్యంగా పోలీస్ స్టేషన్ కు తరలించి స్టేషన్ లో అతని పై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దాడి చేయడం బోరబండ పోలీసులు గుండాల వలే వ్యవహరించినారని ఈ దౌర్జన్యానికి పాల్పడ్డ ఇన్ స్పెక్టర్ జమాల్ ను, పోలీస్ సిబ్బంది పై తక్షణమే కేసులు నమోదు చేసి వారిని విధుల నుండి తొలగించాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి తెలంగాణ డిజిపి ని డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు ముందు కూడా సిద్దిపేట సిరిసిల్ల జనగామ కోర్టులలో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదుల పై అక్కడి పోలీసుల ప్రవర్తనకు నిరసనగా న్యాయవాదులు ధర్నాలు నిరసనలు కోర్టు విధులు బహిష్కరణ లతో కూడిన సంఘటనలు మరువక ముందే మళ్లీ ఈ కూకట్ పల్లి పోలీసులు సంతోష్ అనే న్యాయవాది పై దౌర్జన్యం చేయడం పోలీసుల వ్యవహార శైలి వారి అత్యుత్సాహానికి నిదర్శనమని ఇలాంటి కొంతమంది పోలీసుల వైఖరి వల్లే మొత్తం వ్యవస్థకే మచ్చ తెచ్చే విధంగా ఉందని ఈ మొత్తం సంఘటనల పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని ఎందుకంటే న్యాయశాఖ హోంశాఖ మంత్రిత్వ శాఖలు రెండు ముఖ్యమంత్రి వద్దనే ఉన్నాయని ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. న్యాయవాదుల పై వరుస దాడులకు పాల్పడ్డ పోలీసుల ప్రవర్తనను పరిగణలోకి తీసుకొని వారి పై చట్టపరమైన చర్యలు తీసుకొని భవిష్యత్తు లో మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసే బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి డిజిపి లే తీసుకోవాలని లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టులను స్తంభింపజేసి విధులు బహిష్కరించి అన్ని కోర్టుల ముందు టెంట్ లు వేసి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోలీసుల ఆగడాలకు వ్యతిరేకంగా దీక్షలు ధర్నాలు చేస్తామని కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు బెజ్జంకి శ్రీకాంత్ పస్తం ఆంజనేయులు కొండ్ర లక్ష్మణ్ సీనియర్ జూనియర్ న్యాయవాదులు కటకం శ్రవణ్ కుమార్ దాసరి రామ్ రెడ్డి గుడిపాటి సత్యం రెడ్డి కట్ట రమేష్ వీరసుందర్ మల్యాల ప్రతాప్ దామోదర్ రెడ్డి బలరాం సర్దార్ గురు బీర్ సింగ్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రతి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా - జగదీశ్వర్ గౌడ్

**మాదాపూర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ బస్తీ అభివృద్దే లక్ష్యంగా**




**పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతాం**



**షణ్ముఖ వెలుగు శేరిలింగంపల్లి ప్రతినిధి ఆగస్టు 19:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర నందు స్థానిక నాయకులు ప్రజలతో కలిసి నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు అనంతరం నెలకొన్న బస్తి సమస్యలను అడిగి తెలుసుకున్నారు,బస్తీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జి.హెచ్.ఎం.సి ఏఈ ప్రశాంత్ స్థానిక ప్రజలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్క ప్రణాళికతో గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోనీ మాదాపూర్ డివిజన్ ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం చూపుతామని డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేల అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర గౌడ్ ఈ కార్యక్రమంలో బస్తి నాయకులు మునఫ్ ఖాన్ ,రహీం హనీఫ్, మహమ్మద్ ఖాజా,షోయబ్,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తాండ్రియాల లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**షణ్ముఖ వెలుగు కథలాపూర్ ప్రతినిధి ఆగస్టు 19:** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామం లోని ఊర చెరువులో ఆగస్టు19 సోమవారం ఉదయం సుమారు 11:00 గంటల సమయం లో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం గ్రామస్థులకు కనిపించడంతో కథలాపూర్ పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు. సంఘటన స్థలానికి కథలాపూర్ ఎస్సై జి నవీన్ కుమార్ పోలీస్ సిబ్బందితో చేరుకొని వివరాలు సేకరించారు. చెరువులో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించి కోరుట్ల ప్రభుత్వాసుపత్రి మార్చురీ గదిలో భద్రపరచనైనది అని తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 మధ్య ఉంటుందన్నారు మృతుని ఫోటో ఆధారంగా వివరాలు తెలిసినవారు కథలాపూర్ ఎస్సై జి నవీన్ కుమార్ సెల్ నెంబర్ కు 8712656793 కు సమాచారం తెలుపాలన్నారు

## వాసవి కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి ఆగస్టు 19:** మెట్ పల్లి పట్టణ వాసవి కిరాణం జనరల్ స్టోర్స్ అసోసియేషన్ మెట్ పల్లి కన్స్యూమర్స్ ప్రోడక్టు డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలకత్తా లో వైద్య విద్యార్థిని పై జరిగిన పైశాచిక అఘాయిత్యాన్ని ఖండిస్తూ ఆ దుర్మార్గులను వెంటనే కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆ దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని వైద్య విద్యార్థిపై జరిగిన అత్యాచారం హత్య సంఘటన నిరసిస్తూ కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు అనంతరం ఆ వైద్య విద్యార్థి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు ఈ కార్యక్రమంలో అయిత శ్రీనివాస్ చాడ సురేష్ దొంతుల సంతోష్ సాయి జొన్న శ్రీను మహేష్ పాంపట్టి ఆనంద్ చకినం కేదార్ నాథ్ చిలమంతుల మహేష్ యాంసాని ప్రసాద్ ఎలగందుల అంజయ్య జవ్వాజి అరవింద్ గుండు శివ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## అడ్డ గూడూరు ఏవో గా బాధ్యతలు స్వీకరించిన పాండురంగా చారి



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి ఆగస్టు 19:** అడ్డ గూడూరు మండల వ్యవసాయ అధికారిగా పాండురంగా చారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అడ్డ గూడూరులో ఏ ఓ గా పని చేసిన అరుణ కుమారి బదిలీపై ఆత్మకూరు (యం ) కు వెళ్లగా వికారాబాద్ జిల్లా డీఎవో కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్ గా పని చేస్తూ బదిలీపై అడ్డ గూడూరు మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఏవో పి పాండురంగా చారికి ఏ ఈ ఓ లు నవనీత దయాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

## సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన విప్ బీర్ల ఐలయ్య దంపతులు



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సోమవారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం ఏ ఎజాస్ కౌన్సిలర్ చింతల ఫణి సునీత శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొండ్రాజు వెంకటేశ్వరరాజు నీలం పద్మ గంధమల్ల అశోక్ నీలం వెంకటస్వామి కూళ్ల నరసింహులు వల్లెపు ఉప్పలయ్య పోరాల సతీష్ మల్లెల శ్రీకాంత్ అంగిడి ఆంజనేయులు ఉట్కూరు సురేష్ కర్రే అజయ్ దడిగె అనిల్ చిన్నం రాజు అనిల్ జట్ట సిద్ధులు సంపత్ లోకేష్ భాస్కర్ నరేష్ అఖిల్ శివ ఎండి బాబా జ్ఞానేందర్ బొడ్డు మల్లేష్ పాము అనిత గడిపే రేణుక జయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ ఫోటోగ్రాఫర్లకు సన్మానం



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి ఆగస్టు 19:** మెట్ పల్లి లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని మెట్ పల్లి పట్టణ సీనియర్ ఫోటోగ్రాఫర్స్ గుండా రాకేష్ సాంబారి శ్రీనివాస్ లను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్ సెక్రెటరీ గూండా రాకేష్ క్యాషియర్ నాంపల్లి వేణు గోపాల్ జెడ్ సి గడ్డం శంకర్ రెడ్డి మహాజన్ నర్సింలు వెల్మల శ్రీనివాసరావు చెర్రపల్లి అరుణ్ దీప్ గౌడ్ ఇల్లెందుల వెంకటేశ్వర్లు ముక్క మృత్యుంజయ పాల్గొన్నారు.

## కుల మతాలకు అతీతంగా రక్షా బంధన్ వేడుకలు జరుపుకున్న మున్సిపల్ ఉద్యోగులు



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి ఆగస్టు 19:** రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని కుల మతాలకు అతీతంగా మున్సిపల్ ఉద్యోగులైన ముస్లిం సోదరులకు పటేవార్ సునంద రాఖీ కట్టారు తోడబుడితేనే అన్నా చెల్లెలు కాదు రక్తసంబంధం లేకున్నా తన భర్త ఆత్మీయ స్నేహితులను అన్న తమ్ముళ్ల వలె భావించి రక్షాబంధన్ వేడుకలు నిర్వహించుకున్నారు మెట్ పల్లి మున్సిపల్ లో సానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ముజీబ్.నిజాం ఆకుల నర్సయ్య గోనెల రమేష్ రాఖీ కట్టి వేడుకలు నిర్వహించుకున్నారు అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు ఈ కార్యక్రమంలో పటేవర్ ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు రాఖీ కట్టిన మండల మహిళా అధ్యక్షురాలు పులి శిరీష హరిప్రసాద్





**షణ్ముఖ వెలుగు కథలాపూర్ ప్రతినిధి ఆగస్టు 19 :** రాఖీ పౌర్ణమి సందర్భంగా వేములవాడ లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు సోమవారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పులి శిరీష హరి ప్రసాద్ రాఖీ కట్టి స్వీట్ తినిపించారు అనంతరం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు యువకులారా...పారాహుషార్

-మొదటిపేజీ తరువాయి

అక్కడి యువత, విద్యార్థులు అల్లకల్లోలం సృష్టించి యావత్ దేశాన్ని పూర్తిగా ప్రమాదంలోకి నెట్టేశారు. ఇయాళ బంగ్లాదేశ్ పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయింది. వాళ్ల డిమాండ్లు న్యాయమైందే కావచ్చు. కానీ వాళ్ల వెనుకండి నడిపిస్తున్న వాళ్ల ప్రయోజనాలేమిటి? దీనివల్ల దేశానికి జరిగే నష్టమేమిటి? అనే అంశాలపై అక్కడి యువత, విద్యార్థుల్లో అవగాహన కల్పించలేకపోవడంవల్లే ఆ దేశం నేడు క్లిష్టపరిస్థితుల్లో ఉంది. అని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో భారతదేశంలోని యువత, విద్యార్థులు అత్యంత జాగురకతతో ఉంటూ దేశ పరిణామాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవడంతోపాటు దేశాన్ని విచ్చిన్నం చేసే శక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈరోజు మంచిర్యాల జిల్లా చొక్కారాంనగర్ రాంపూర్ లోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయ నూతన భవన నిర్మాణానికి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ ప్రసంగించారు. ఏమన్నారంటే.ఉమ్మడి రాష్ట్రంలో మొట్టమొదటి శిశు మందిర్ భవనాన్ని నూతనంగా నిర్మించేందుకు పూర్వ విద్యార్థులే ముందుకు రావడం గొప్ప విషయం. భవిష్యత్తులో ఈ విద్యాలయమే తెలంగాణ, ఏపీలో నెంబర్ వన్ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇక్కడ విద్యా సంస్థ కోసం 33 ఎకరాలిచ్చిన దాతలకు చేతులెత్తి నమస్కరిస్తున్నా. ప్రతి ఒక్కరూ ఈ భవన నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరుతున్నా. తెలంగాణలో ఇతర ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు శిశు మందిర్ కు ఉన్న తేడాను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. కార్పొరేట్ స్కూళ్లలో కెరీర్ పేరుతో చదువు చెప్పడానికే పరిమితమవు తున్నారు. సంస్కృతి, దేశభక్తి గురించి పట్టించుకోవడం లేదు. ఏ విద్యా సంస్థలో ఎక్కువ ఫీజులుంటే అక్కడే బాగా చదువు




చెబుతారనే చెడు భావన నేడు తల్లిదండ్రుల్లో కూడా రావడం బాధాకరం. సంస్కారం, సభ్యత, క్రమశిక్షణ, సమాజంపట్ల అవగాహన లేకుండా ఎంత చదివినా ఉపయోగం లేదు. నాలో రాజకీయ నేత కావాలనే స్కిల్స్ ఉన్నాయని గమనించి శిశు మందిర్ లో ప్రోత్సహించడంవల్లే నేను ఈ రోజు ఈస్థాయికి ఎదిగిన. ఎవరిలో ఏ స్కిల్స్ ఉన్నాయో గమనించి దానికి తగ్గట్లు ప్రోత్సహించడమే శిశు మందిర్ లక్ష్యం. కాలానుగుణంగా శిశు మందిర్ లో కూడా ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినా దేశ భక్తి, సంస్కృతి క్రమశిక్షణ, మాతృభాష పట్ల మమకారం మాత్రం మారలేదు. సదాచారం మారలేదు.

నాకు సొసైటీలో గౌరవం ఉందంటే నేను శిశు మందిర్ స్టూడెంట్ ను కావడంవల్లే. దేశం, ధర్మం గురించి మాట్లాడగలుగుతున్నానంటే శిశు మందిర్ వల్లే. దేశంలో జరుగుతున్న పరిణామాలపై ఇతర కార్పొరేట్ పాఠశాలల్లో చర్చించరు. వాళ్లకు బట్టీ పట్టి చదివించడంతప్ప మరొకటి ఉండదు. కానీ శిశు మందిర్ ఆయా అంశాలపై చర్చించడంతోపాటు ఎప్పటికప్పుడు దేశంలో జరుగుతున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించేది శిశు మందిర్.విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించకపోతే దేశానికి ఎంత నష్టం జరుగుతుందో బంగ్లాదేశ్ నిదర్శనం. రిజర్వేషన్ అనే అంశాన్ని తీసుకుని అక్కడి యువత, విద్యార్థులు అల్లకల్లోలం సృష్టించి యావత్ దేశాన్ని పూర్తిగా ప్రమాదంలోకి నెట్టేశారు. సంక్షోభంలో కూరుకుపోయేలా చేశారు. వాళ్ల డిమాండ్లు న్యాయమైందే కావచ్చు. వాళ్లను ఎవరు నడిపిస్తున్నారు? దీనివెనుక ఉన్న స్వార్ధ శక్తులేమిటి? వారి ప్రయోజనాలేమిటో ఆలోచించలేదు. దీనివల్ల యావత్ బంగ్లాదేశ్ నాశనమైంది. పూర్తి అవగాహన కల్పించడంలో విఫలమైనందునే ఈ దుస్థితి ఏర్పడింది. ఈ విషయంల్ మన దేశ యువత కూడా జాగ్రుతం కావాలని కోరుతున్నా.తెలంగాణలో నక్సల్ భావజాలమున్న వాళ్ల ప్రమేయంతో విద్యా వ్యవస్థను నాశనమయ్యే దుస్థితి ఏర్పడింది. మన దేశ చరిత్ర, సంస్కృతిని మరుగునపడే ప్రమాదముంది. ఇది ఏ మాత్రం మంచిది కాదు. దేశానికి, సమాజానికి మంచి జరిగేలా విద్యా వ్యవస్థలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. తమ రాజకీయ లబ్ది కోసం నక్సల్స్ భావజాలాన్ని, మార్క్స్, మావో భావజాలాన్ని, స్వార్ధ ప్రయోజనాలను పాఠ్యాంశాలు పొందుపర్చాలని కొంతమంది విర్రవీగుతున్నారు. అలాంటి వారిపట్ల జాగ్రుతం కావడంతోపాటు నేటి విద్యార్థులు, తల్లిదండ్రులు, శిశు మందిర్ లో చదివిన విద్యార్థులంతా పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలి.

# మైండ్ గేమ్ పాలిటిక్స్

-మొదటిపేజీ తరువాయి

ఏర్పడింది. అయితే వారు చేసినట్టుగా భారత రాష్ట్ర సమితి విలీనం సాధ్యమవుతుందా.. అది అంత సులభమా.. అలా చేస్తే భారత రాష్ట్ర సమితికి ఎలాంటి లాభం చేకూరుతుంది.. అనేవి డిబేటబుల్ ప్రశ్నలు. భారత రాష్ట్ర సమితిని విలీనం చేస్తామని అంటున్న మాటలు ఇవాల్టివి కావు. గతంలో 2004 లో కాంగ్రెస్ పార్టీతో అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి పొత్తు పెట్టుకుంది. అప్పట్లో హరీష్ రావు మంత్రి అయ్యారు. కెసిఆర్ కేంద్ర మంత్రి అయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి బయటికి వచ్చింది. 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీలో తెలంగాణ రాష్ట్ర సమితి విలీనం అవుతుందని వార్తలు వినిపించాయి. అయితే అవి వాస్తవరూపం దాల్చలేదు. ఆ తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది. 2018 ఎన్నికల్లోనూ తెలంగాణ రాష్ట్ర సమితి అధికారాన్ని దక్కించుకుంది. ఈ రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్ర సమితి కాంగ్రెస్ పార్టీని ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టాలో.. అన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టింది. 2023 ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ ఫినిక్స్ పక్షి లాగా దూసుకొచ్చింది. అధికారాన్ని దక్కించుకుంది. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పది సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కెసిఆర్ కుమార్తె కవిత అరెస్టు అయ్యారు. ప్రస్తుతం ఆమె ఢిల్లీలో శిక్ష అనుభవిస్తున్నారు. గత ఐదు నెలలుగా జైల్లో ఉంటున్నారు. ఆమెకు బెయిల్ ఇచ్చేందుకు కోర్టులు సమ్మతం తెలపడం లేదు. ఈ దశలో కవితకు బెయిల్ రావాలంటే కచ్చితంగా కేసీఆర్ తన పార్టీని బిజెపిలో విలీనం చేస్తారని.. కెసిఆర్ కు గవర్నర్ పదవి, కేటీఆర్ కు మంత్రి పదవి, హరీష్ రావుకు తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడి పదవి



లభిస్తుందని ఇటీవల రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మరోవైపు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. కెసిఆర్ తన పార్టీని కాంగ్రెస్లో విలీనం చేస్తారని.. ఎందుకంటే ఆయన ప్రభుత్వ హయాంలో ఎన్నో అవకతవకలు జరిగాయని.. వాటిపై విచారణ నిలుపుదల చేయాలంటే కచ్చితంగా కేసీఆర్ తన పార్టీని కాంగ్రెస్లో విలీనం చేయాల్సిందేనని పేర్కొన్నారు.భారత రాష్ట్ర సమితికి గత అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలు వచ్చాయి. పార్లమెంటు ఎన్నికల్లో 0 స్థానాలు వచ్చాయి. ఇక ఆ పార్టీ కి భాస్ గా కెసిఆర్ ఉన్నారు. మనదేశంలో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలలో భారత రాష్ట్ర సమితి కూడా ఒకటి. వ్యూహాత్మక పొత్తులు.. ఎన్నికల్లో సహకారం వంటి అంశాల ఆధారంగా ప్రాంతీయ పార్టీలు జాతీయ పార్టీలకు మద్దతు పలికాయి. ఇప్పటికీ ఆ సంస్కృతి కొనసాగుతూనే ఉంది. ఇలాంటి

రాజకీయాలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో భారత రాష్ట్ర సమితి విలీనం అనేది దాదాపు అసాధ్యమని.. మీడియాలో ఎప్పటికీ ఫోకస్ మోడ్ లో ఉండాలి కాబట్టి రాజకీయ నాయకులు అలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారని.. రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జేడీయూ, డీఎంకే, అన్నా డీఎంకే, ఆర్జేడీ వంటి పార్టీలు జాతీయ పార్టీలలో విలీనం అవుతాయని గతంలో వార్తలు వచ్చాయి.. వాస్తవానికి అవేవీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం తెలంగాణలో భారత రాష్ట్ర సమితి కూడా జాతీయ పార్టీలలో విలీమవుతుందని వార్తలు వస్తున్నాయి. చివరికి అవి వార్తలు గానే మిగిలిపోతాయి. కాకపోతే రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యల వల్ల మీడియాకు ఒక మసాలా దొరుకుతుంది. ఆ వార్తలు చదివే వారికి కాస్త కాలక్షేపం లభిస్తుంది. అంతే అంతకుమించి ఏమీ లేదు.

# కంటిలో నలుసులా బావ, బామ్మర్ది...

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ కురుక్షేత్రంలో కృష్ణార్జునులు కేటీఆర్, హరీశ్‌రావు? ఈ ఇద్దరు బావా బామ్మార్దులు అధికార కాంగ్రెస్‌కు కంట్లో నలుసులా మారారు.ఆపరేషన్ కృష్ణార్జున?. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెరపైకి తెచ్చిన ఆపరేషన్ ఇది. ప్రభుత్వంపై మాటల దాడి చేస్తున్న విపక్ష నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌ను టార్గెట్ చేయడటమే ఈ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశం. గత 8 నెలలుగా ప్రభుత్వంపై అవిశ్రాంత పోరాటం చేస్తున్న ఈ ఇద్దరు బావా బామ్మార్దులు?. సీఎం రేవంత్‌రెడ్డికి చికాకుగా తయారయ్యా రంటున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొద్దిరోజులుగా సైలెంట్ అయిపోయినప్పటికీ.. తమ బాస్‌ను మించి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. ప్రతి సందర్భంలోనూ అధికార పక్షాన్ని కార్నర్ చేస్తున్నారు బావబామ్మర్దులు. దీంతో ఈ ఇద్దరి కట్టడే ఇప్పుడు కాంగ్రెస్ టార్గెట్ గా పెట్టుకుంది. కేటీఆర్, హరీశ్‌రావును ఆపితే చాలు? కాంగ్రెస్ పార్టీకి ఎదురే ఉండదని భావిస్తున్నారు ఆ పార్టీ నేతలు. బీఆర్‌ఎస్‌లో మిగిలిన నేతలను పక్కనపెట్టి కేటీఆర్, హరీశ్‌రావును టార్గెట్ చేస్తూ ముందుకు వెళ్లడమే సర్కార్ వ్యూహంగా తెలుస్తోంది. వారిద్దరినీ టార్గెట్ చేయాలని కేడర్‌కు సందేశం పంపారట ప్రభుత్వ పెద్దలు. అందుకే రెండు రోజులుగా హరీశ్‌రావు, కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ నిరసనలు ఉధృత మయ్యాయంటున్నారు.అసెంబ్లీలోనూ బయటా ఒకరి తర్వాత ఒకరు గుక్క తిప్పకుండా విమర్శలు గుప్పిస్తుండటంతో ఆ ఇద్దరిని ఆపేదెలా? అని ఆలోచించిన ప్రభుత్వం పకడ్బందీ వ్యూహరచన చేసిందంటున్నారు. ఏ చిన్న అవకాశం లభించినా? హరీశ్‌రావు, కేటీఆర్‌ను వదలొద్దని కేడర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందంటున్నారు.రుణమాఫీ అంశంపై హరీశ్‌రావు రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఆందోళనలు చేయడం? ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మహిళా కమిషన్ నోటీసులు జారీ చేయడం వెనుక ఆపరేషన్ కృష్ణార్జున వ్యూహమే ఉందంటున్నారు. 8 నెలల కాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం ఎంతలా కష్టపడినా, అందరికీ రుణమాఫీ జరగలేదని హరీశ్‌రావు నానాయాగీ చేస్తున్నారని మండిపడుతోంది కాంగ్రెస్. గతంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు? రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని ఆరోపిస్తున్నారు.గత ప్రభుత్వంలో తాము లక్ష మాఫీ చేస్తేనే 17 వేల కోట్లు వెచ్చిస్తే? ఇప్పుడు రెండు లక్షల మాఫీకి ఇంచుమించు అంతేమొత్తం కేటాయించడంపై అనుమానాలు లేవనెత్తుతున్నారు హరీశ్‌రావు. దీంతో హరీశ్ టార్గెట్ గా ఎదురుదాడి మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. రుణమాఫీ జరిగితే తాను రాజీనామా చేస్తానని గతంలో హరీశ్‌రావు చేసిన సవాల్‌ను తాజాగా తెరపైకి తెచ్చి?. ఊరూరా ప్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు కాంగ్రెస్ కార్యకర్తలు. రుణమాఫీ జరిగినందున హరీశ్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఇక తొలి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య డైలాగ్ వార్ నడుస్తూనే ఉంది. తాజాగా కొందరు మహిళలు బస్సులో వెల్లుల్లి వేరడం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టగా, మరోమారు రెండు పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు చోటుచేసుకున్నాయి. ఈ సమయంలోనే ఉచిత బస్సుపై విమర్శలు చేసిన కేటీఆర్? మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆక్షేపిస్తూ? సుమోటాగా నోటీసులు జారీ చేసింది మహిళా కమిషన్.దీంతో కేటీఆర్ కూడా తన వ్యాఖ్యలను ఉపసంహకుంటూ క్షమాపణ చెప్పేశారు. అయినా కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని ఊరూరా కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునివ్వడం.. ఈ నెల 24న తన ముందు విచారణకు హాజరుకావాలని మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద ఆదేశాలివ్వడం వెనుక కాంగ్రెస్ వ్యూహం ఉన్నట్లు టాక్ నడుస్తోంది. దీంతో ఒకే సమయంలో ఇటు హరీశ్, అటు కేటీఆర్‌ను కార్నర్ చేస్తూ రాజకీయాన్ని రక్తికట్టిస్తోంది కాంగ్రెస్.బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ మంచి వాగ్దాటి ఉన్న నేత. సీఎం రేవంత్‌రెడ్డికి తగ్గట్టుగా కేసీఆర్ వాగ్బాణాలు

## తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

-మొదటిపేజీ తరువాయి



ఆగ్రహించారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్ జలసౌధలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

**తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు..**

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. " కేంద్ర బీజేపీ ప్రభుత్వం, తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అన్నదాతలను ఏనాడూ పట్టించుకోలేదు. పకృతి వైపరీత్యాలకు నష్టపోయిన రైతన్నలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏరోజూ ఆదుకోలేదు. రుణమాఫీ చేతగాని గత ప్రభుత్వం మాపై విమర్శలు చేయడం హాస్యాస్పదం. ఇంత వేగంగా మాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే. కొన్ని కారణాల వల్ల కొంతమందికి మాఫీ జగలేదన్నది వాస్తవం. వారి సమస్య త్వరలోనే పరిష్కరించి నగదు అందజేస్తాం. మాఫీ కాని రైతులను బీఆర్ఎస్, బీజేపీ నేతలు రెచ్చగొడుతున్నారు. వారిని ఉద్దేశపూర్వకంగా రెడ్లపైకి తెస్తున్నారు. ప్రతిపక్షాల మాటలను రైతులు వినొద్దు. త్వరలోనే మీకు పూర్తి రుణ మాఫీ చేస్తాం.

**అందుకే మాఫీ అవ్వలేదు..**

రెండుసార్లు రూ.లక్ష రుణమాఫీ ప్రకటించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి, రెండో దశలో చేసిన రుణమాఫీ రైతుల వడ్డీకే సరిపోయింది. అలాంటి నేతలు ఇవాళ మాపై విమర్శలు చేస్తున్నారు. ఏ కారణం చేతనైనా రుణమాఫీ కాకపోతే త్వరలోనే అవుతుంది. రైతులు కంగారు పడాల్సిన పనిలేదు. లక్షా 20వేల ఖాతాల ఆధార్ నెంబర్లు సరిగా లేకపోవడం వల్ల ఆ రైతులకు రుణమాఫీ ఆగింది. అలాగే లక్షా 61వేల అకౌంట్లకు ఆధార్, పాస్ బుక్ పేర్లు వేర్వేరుగా ఉన్నాయి. లక్షా 50వేల ఖాతాల్లో బ్యాంకు తప్పిదాలు ఉన్నాయి. 4లక్షల 83వేల అకౌంట్లకు రేషన్ కార్డు వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. మరో 8లక్షల అకౌంట్లకు రూ.2లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్నాయి. వీటన్నింటిని పరిష్కరిస్తాం. రూ.2లక్షలపైన రుణాలు ఉన్న రైతులు పైమొత్తం చెల్లించిన తర్వాత వారికి రుణమాఫీ అవుతుంది. సమస్యల పరిష్కారానికి అన్ని మండల కేంద్రాల్లో ఫిర్యాదు కేంద్రాలు ఏర్పాటు చేశాం. అర్హత ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీ జరుగుతుంది" అని చెప్పారు.

## బాలికకు అండగా నిలిచిన సీఎం రేవంత్

-మొదటిపేజీ తరువాయి

తల్లి ఆత్మహత్యతో ఒంటరిగా మిగిలిపోయిన బాలిక దుర్గకు అన్ని విధాలా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్‌తరోడా గ్రామానికి చెందిన ఒంటరి మహిళ మేర గంగామణి (36) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆమె ఏకైక కుమార్తె దుర్గ (11) అనాథగా మిగిలింది. తల్లి అంత్యక్రియలకు డబ్బులేకపోవడంతో దుర్గ భిక్షాటన చేసింది. విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. బాలికకు విద్యా,వైద్య, ఇతర అవసరాలకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ అభినవ్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాల మేరకు బాలికకు ఉచిత విద్య అందించేందుకు గురుకుల పాఠశాలలో చేర్చుతామని కలెక్టర్ వెల్లడించారు. వైద్యం, ఇతర సమస్యలేమైనా ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

తీసుకు వచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి చాలామంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. తరచూ ప్రయాణాలు చేసేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ టెస్ట్ చేయాలని సూచించారు. అవసరమైన మెడికల్ కిట్స్, మందులను అందుబాటులో ఉంచాలని వైద్య అధికారులకు సూచించారు. గాంధీ ఆసుపత్రి, ఫీవర్ ఆసుపత్రులలో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

## రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా?



-మొదటిపేజీ తరువాయి

కాలరాయడమేనని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలియచేస్తున్న రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారని, అరెస్టులు చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులు రుణమాఫీ కాకపోవడంతో కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోతున్నారని చెప్పారు. ఏం చేయాలో తెలియక చివరకు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నదని వెల్లడించారు. ప్రభుత్వం రైతుల రుణమాఫీ సమస్యకు పరిష్కారం చూపకుండా, పోలీసులను పురమాయించి గొంతెత్తిన వారిని బెదిరించడం, అణగదొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఒకవైపు రైతుబంధు రాక, మరోవైపు రుణమాఫీ కాక అన్నదాత ఆవేదనలో ఉన్నాడని చెప్పారు. వ్యవసాయ పనులు చేసుకోవాలా లేక రుణమాఫీ కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాలా అంటూ కన్నీరు పెట్టుకుంటున్నారని వెల్లడించారు. ఏకకాలంలో ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆచరణలో మాత్రం అట్టర్ ఫ్లాప్ అయ్యారని ఎద్దేవాచేశారు. నమ్మి ఓటేసినందుకు రైతన్నను నట్టేట ముంచారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడ్డట్లు చరిత్రలో లేదన్న విషయాన్ని కాంగ్రెస్ పాలకులు మరిచిపోయినట్లున్నారని చెప్పారు. ఇప్పటికైనా కండ్లుతెరిచి రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఆందోళనలో ఉన్న రైతాంగానికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు. అదిలాబాద్ సహా ఇతర జిల్లాల్లో రైతన్నలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే అరెస్టు చేసిన రైతన్నలకు అండగా బీఆర్ఎస్ పార్టీ కార్యచరణ ప్రకటిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## హైడ్రా దూకుడుతో.. అక్రమార్కుల్లో గుబులు

**హైదరాబాద్ :** హైదరాబాద్, నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో హైడ్రా ఆపరేషన్ కొనసాగుతోంది. హైడ్రా దూకుడుతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారి గుండెల్లో గుబులు మొదలైంది. తాజాగా గండిపేట ఏరియాలో అక్రమంగా కట్టిన భవనాలను హైడ్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం కూల్చివేసింది. హైడ్రా చర్యలపై నగర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రంగారెడ్డి జిల్లాలోని గండిపేట్ సరస్సు, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లోని అక్రమ భవనాలను హైడ్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం కూల్చివేసింది. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈ కూల్చివేతలు చేపట్టింది. సరస్సును ఆక్రమించి నిర్మించిన అపార్ట్‌మెంట్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కూల్చివేశాయి. ఇటు హైడ్రా చర్యలను, కూల్చివేతలను నగర వాసులు స్వాగతిస్తున్నారు. తమకు తెలిసిన అక్రమ కట్టడాలు, ఆక్రమణల గురించి హైడ్రాకు తెలియజేస్తున్నారు.హైడ్రా అంటే.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ. ఇటీవలే ప్రత్యేక స్వతంత్ర వ్యవస్థగా రేవంత్ సర్కారు దీన్ని ఏర్పాటు చేసింది. జీహెచ్‌ఎంసీ తోపాటు హైదరాబాద్ నగర శివార్లలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లోనూ హైడ్రా ఆపరేషన్ కొనసాగుతోంది.

# మేనిఫెస్టో విడుదల చేసిన నేషనల్ కాన్ఫరెన్స్

**శ్రీనగర్ :** జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. ఈ అసెంబ్లీ ఎన్నికలు మూడు విడతలుగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా సోమవారం శ్రీనగర్‌లో తమ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆర్టికల్ 370తోపాటు 35ఏని పునరుద్దరిస్తామని ఆయన స్పష్టం చేశారు. వీటితోపాటు మరో 10 అంశాలను మేనిఫెస్టో జాబితాలో పొందు పరిచారు. ప్రజా భద్రత చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. అలాగే రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని తెలిపారు. భారత్, పాక్ మధ్య నిలిచిపోయిన చర్చలను పునరుద్దరిస్తామని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుక బడిన మహిళలకు ఏడాదికి 12 గ్యాస్ సిలెండర్లు అందజేస్తామన్నారు. అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాశ్మీర్ పండిట్లకు పూర్వ వైభవం తీసుకు వస్తామని తెలిపారు. పాస్‌పోర్టు సౌకర్యాన్ని సులభతరం చేస్తామన్నారు. ఇక జాతీయ రహదారులపై ప్రజలను, వాహనదారులను ఇష్టారీతిలో ఆపడం, తనిఖీలు నిర్వహించడం వంటి ఘటనలు నిరోధిస్తామని చెప్పారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. 90 స్థానాలున్న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి




మూడు విడతలుగా... సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఓటరు ఏ పార్టీకి పట్టం కట్టనున్నాడనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# సీఎం సిద్దరామయ్యకు తాత్కాలిక ఉపశమనం

**బెంగళూరు :** కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకో వద్దని ట్రయిల్ కోర్టును కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ముడా కుంభకోణంలో సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ తవర్‌చంద్ గెహ్లాత్ అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. గవర్నర్ ఆదేశాలను నిలిపివేయాలంటూ సీఎం సిద్దరామయ్య సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ రిట్ పిటిషన్‌పై సింగిల్ బెంచ్ జడ్జి హేమంత్ చందన్‌గౌడ్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య తరపు న్యాయవాదీ అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలను వినిపించారు. ఆ క్రమంలో ఆగస్ట్ 29వ తేదీ వరకు సీఎం సిద్దరామయ్యను ఎలాంటి విచారణ జరప వద్దని న్యాయమూర్తికి వివరించారు. దీంతో న్యాయవాది సింఘ్వీ



వాదనలతో సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన గౌడ్ ఏకీభవించారు. దీంతో ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకో వద్దని ఆదేశించింది.

మైసూర్ నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణంలో సీఎం సిద్దరామయ్య ప్రమేయం ఉందంటూ.. సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, టీజే అబ్రహం తదితరులు.. ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ప్రత్యేక కోర్టుకు గవర్నర్ తావర్ చంద్ గెహ్లాత్ ఆగస్ట్ 17వ తేదీన అనుమతి ఇస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను వెంటనే రద్దు చేయాలంటూ సిఎం సిద్దరాయమ్య.. సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌ను సోమవారం సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ విచారించారు. సీఎం సిద్దరామయ్యను ఆగస్ట్ 29వ తేదీ వరకు ప్రాసిక్యూషన్ చేయకూడదంటూ సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ ఆదేశించారు. దీంతో సీఎం సిద్దరామయ్యనకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లు అయింది.

## ఆమె నిర్మమతా బెనర్జీ

### దీదీ రాజీనామాకు బీజేపీ డిమాండ్

కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనకు బాధ్యత వహించి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. సీఎం మమతా బెనర్జీని విధ్వంసకురాలిగా బీజేపీ ప్రతినిధి గౌరవ్ భాటియా అభివర్ణించారు. ఈ హేయమైన ఘటన అనంతరం ఆమె పేరును రాష్ట్ర ప్రజలు నిర్మమతా బెనర్జీగా మార్చేశారని ఎద్దేవా చేశారు. మమతా బెనర్జీ తన చేష్టలతో సమాజానికి సేవ చేసే ఓ యువ డాక్టర్ గౌరవాన్ని మంటగలిపారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టబద్ధ పాలనకు దీదీ పాతరేశారని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ నేరంలో ఆధారాలను స్వయంగా సీఎం చెరిపివేయడం హేయమని అన్నారు. దేశ రాజ్యాంగాన్నే ఆమె నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. విద్యార్థులను కాపాడాల్సిన మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ తన విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారు

# చర్చలు జరగలేదు: బాబులాల్ మారండి

జేఏంఎంలో సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి చంపై సోరెన్ కాక రేపారు. తనకు అవమానం జరిగిందని, సీఎల్పీ సమావేశం గురించి తెలియదని, సీఎం పదవికి రాజీనామా చేయాలని కోరడంతో షాక్ తిన్నానని సోరెన వివరించారు. జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల కన్నా ముందే పార్టీ మారతానని హింట్ ఇచ్చారు. ఏ పార్టీ, ఎప్పుడు చెరతారనే అంశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. బీజేపీలో చేరతారనే ఊహాగానాలు మాత్రం జోరందుకున్నాయి.

బీజేపీలో చేరతారా..?

చంపై సోరెన్ జార?ండ్ నుంచి ఢిల్లీ రావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. నేడో, రేపో పార్టీ మారతారాని జోరుగా ప్రచారం జరిగింది. వ్యక్తిగత కారణాలతో ఢిల్లీ వచ్చానని సోరెన్ వివరించారు. ఇదే అంశంపై జార?ండ్ బీజేపీ చీఫ్ బాబులాల్ మారండిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. చంపై సోరెన్ బీజేపీలో చేరతారా..? ఎప్పుడు చేరతారని అడిగారు.

ఆయనే ప్రకటిస్తారు..

'చంపై సోరెన్ బీజేపీలో చేరే అంశానికి సంబంధించి ఇప్పటి



వరకు చర్చ జరగలేదు. చంపై సోరెన్ అనుభవం ఉన్న నేత, నిర్ణయాన్ని ఆయన ప్రకటిస్తారు. ప్రత్యేక జార?ండ్ రాష్ట్రం కోసం పోరాడిన వారిలో చంపై సోరెన్ ఒకరు. సోషల్ మీడియాలో చంపై సోరెన్ చేసిన పోస్ట్ చూసి బాధ కలిగింది. పార్టీలో జరిగిన అవమానంతో తీవ్రంగా బాధ పడ్డారు. సీఎం పదవి నుంచి తొలగించిన విధానం బాధ కలిగించింది. అందుకే పార్టీతో అంటిముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు అని' బాబులాల్ మారండి అభిప్రాయ పడ్డారు.

## కోల్‌కతా డాక్టర్ కేసుపై ఆప్ ఎంపీ హర్భజన్ సింగ్ లేఖ..

# స్పందించిన బెంగాల్ గవర్నర్

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ ఆస్పత్రిలో ఆగస్టు 9న మహిళా వైద్యురాలిపై హత్యాచారం ఘటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారిపోయింది. ఈ విషాద ఘటన విషయంలో మాజీ క్రికెటర్, ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ రాసిన గవర్నర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఈ కేసు విషయంలో ఏం చర్యలు తీసుకున్నారని సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. దీనిపై స్పందించిన పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ రాష్ట్రంలోని వివిధ సంఘాల ప్రతినిధులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయంలో తీసుకున్న చర్యల గురించి తెలియజేయడానికి, ఈ విషయంలో వారి అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి గవర్నర్ అత్యవసరంగా సమావేశమయ్యారు.

ఆసుపత్రులలో భద్రతా ప్రోటోకాల్‌లను బలోపేతం చేయడం, హింసాత్మక బాధితులకు తగిన సహాయాన్ని అందించడం వంటి చర్యలు తీసుకోవాలని హర్భజన్ సింగ్ లేఖలో కోరారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులందరికీ సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించాలన్నారు. సురక్షితమైన పని వాతావరణాన్ని కోరుతూ సమ్మె చేస్తున్న వైద్యులకు రాజకీయవేత్తగా మారిన హర్భజన్ సింగ్ మద్దతు తెలిపారు. వైద్య సంఘం ఇప్పటికే సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో పని చేస్తుందని ఆయన చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి భద్రత కూడా చాలా ముఖ్యమన్నారు. భయాందోళనల నేపథ్యంలో వారు పనిచేస్తున్నప్పుడు అంకితభావంతో తమ విధులను ఎలా నిర్వర్తిస్తారని ప్రశ్నించారు.

**రాజీపడే ప్రసక్తే**





ఈ నేపథ్యంలో హర్భజన్ సింగ్‌కు తీసుకున్న, తీసుకోవలసిన చర్యల గురించి గవర్నర్ వివరించనున్నారు. ఈ నేపథ్యంలో మహిళల భద్రత, గౌరవం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని గవర్నర్ అన్నారు. నేరస్తులకు చట్టపరంగా పూర్తి శిక్ష విధించి కఠినంగా శిక్షిస్తామని అన్నారు. ఇలాంటి విషాదాలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి స్త్రీ సురక్షితంగా, రక్షణగా భావించే సమాజాన్ని మేము సృష్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అయితే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సీవీ ఆనంద్ బోస్ మధ్య విబేధాలు ఉన్న నేపథ్యంలోనే ఈ కేసు విచారణ ఆలస్యమవుతుందని పలువురు విమర్శలు చేస్తున్నారు.

**ఆగస్టు 9న దారుణం**

ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ ఆస్పత్రి సెమినార్ హాల్‌లో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేశారు. మూడో అంతస్తులో ఉన్న సెమినార్ హాల్‌లో ఈ ఘటన అర్ధరాత్రి జరిగింది. ఆ సమయంలో ఆమె శరీరంపై చాలా చోట్ల గాయాలు కనిపించాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటన విషయంలో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను అరెస్టు చేశారు. దీంతోపాటు ఇతరుల ప్రమేయం కూడా ఉందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. ఇప్పుడు ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరుపుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తరలించాలని ఆదేశించారు. అవసరమైతే నిందితులకు మరణశిక్ష విధిస్తామని చెప్పారు.

## మరోసారి విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విదేశీ పర్యటనకు వెళుతున్నారు. ఆయన రేపు, ఎల్లుండి యూరోపియన్ దేశం పోలెండ్ లో పర్యటించనున్నారు. ఓ భారత ప్రధాని పోలెండ్ పర్యటనకు వెళుతుండడం 45 ఏళ్ల తర్వాత ఇదే ప్రథమం. మధ్య యూరప్ దేశాల్లో పోలెండ్ దేశం భారత్ కు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఉంది. పోలెండ్ కు కు చెందిన దాదాపు 30 కంపెనీలు భారత్ లో వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. అటు, పోలెండ్ లో భారత్ కు చెందిన 5 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక, పోలెండ్ పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ఉక్రెయిన్ వెళ్లనున్నారు. ఈ నెల 23న ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్ స్కీతో మోదీ భేటీ కానున్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య ఏడాదిన్నర కాలంగా దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మరింత ముదురుతున్న నేపథ్యంలో, మోదీ పర్యటనపై అందరి దృష్టి కేంద్రీకృతం కానుంది. చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ ఎప్పటినుంచో చెబుతోంది. ఇప్పుడు మోదీ కూడా జెలెన్ స్కీతో సమావేశంలో అదే వైఖరికి కట్టుబడి ఉండే అవకాశాలున్నాయి. ఓ భారత ప్రధాని ఉక్రెయిన్ లో పర్యటించనుండడం 30 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి.



## కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం కేసు..

## నిందితుడికి నిజనిర్ధారణ పరీక్ష

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ-ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌కి నిజనిర్ధారణ పరీక్ష (ట్రై డిటెక్టర్ టెస్ట్) నిర్వహిచేంచేందుకు దర్యాప్తు సంస్థ సీబీఐకి కలకత్తా హైకోర్ట్ అనుమతి ఇచ్చింది. వైద్యురాలిపై హత్యాచారం జరిగినప్పటికీ ఆత్మహత్య చేసుకొని చనిపోయిందంటూ ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో ఈ నేరంలో ఇతరుల ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో నిందితుడికి నిజనిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని సీబీఐ అధికారులు కలకత్తా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు నిందితుడికి రేపు (మంగళవారం) పాలిగ్రాఫ్ టెస్ట్ నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు ఈ కేసుపై విచారణ ఆగస్టు 29కి వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది. కాగా హాస్పిటల్‌లో నేరం జరిగిన ప్రదేశంలో నిందితుడు సంజయ్ రాయ్ కదలాడడం సీసీటీవీ ఫుటేజీలో కనిపించింది. అయితే మృతురాలి శరీరంలో 150 గ్రాముల శు క్రకణాలు ఉన్నట్టు గుర్తించడం, ఆమె తల్లిదండ్రులకు తప్పుడు సమాచారం అందించడంతో సామూహిక అత్యాచారం ఏమైనా జరిగిందా?, ఇంకెవరి పాత్రైనా ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ట్రిపుల్ తలాక్‌తో ముస్లిం

## మహిళల పరిస్థితిని దయనీయం

ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణించే చట్టాన్ని సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం సమర్థించింది. ట్రిపుల్ తలాక్ ఆచారం ముస్లిం మహిళల పరిస్థితిని దయనీయంగా మార్చిందని పేర్కొంది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ట్రిపుల్ తలాక్ ఆచారం వివాహమనే సామాజిక సంప్రదాయానికి ప్రమాదకరంగా మారిందని పేర్కొంది. సుప్రీంకోర్టు 2017లో ఈ ఆచారాన్ని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొందని తన అఫిడవిట్‌లో గుర్తు చేసింది. అయినప్పటికీ కొంతమంది ముస్లింలలో ఇప్పటికీ ఈ ఆచారం కొనసాగుతోందని సుప్రీంకోర్టుకు తెలిపింది. ట్రిపుల్ తలాక్ బాధితులు పోలీసులను ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేకపోవడం... చట్టంలో శిక్షార్హమైన నిబంధనలు లేకపోవడంతో బాధిత మహిళల భర్తలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందని వెల్లడించింది. దీంతో పోలీసులు నిస్సహాయంగా మారిపోయారని పేర్కొంది. ట్రిపుల్ తలాక్ విడాకులను నిరోధించేందుకు కఠినమైన నిబంధనలు అవసరమని పేర్కొంది. ట్రిపుల్ తలాక్ విధానం చెల్లుబాటు కాదంటూ సుప్రీంకోర్టు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని, కాబట్టి ట్రిపుల్ తలాక్ విడాకులను నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో కేంద్రం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది.



## ఉదంపూర్‌లో రెచ్చిపోయిన ముష్కరులు..

## కాల్పుల్లో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీరమరణం



జమ్మూ కశ్మీర్‌లోని ఉదంపూర్‌లో సోమవారం సీఆర్పీఎఫ్ బృందంపై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఓ ఇన్‌స్పెక్టర్ వీరమరణం పొందినట్లు సమాచారం. ప్రస్తుతం సంఘటనా స్థలంలో భద్రతా బలగాలను మోహరించారు. ప్రస్తుతం ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య కాల్పులు జరుగుతున్నాయి. ఉదంపూర్‌లోని రామ్‌నగర్లోని చీల్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బృందం సాధారణ పెట్రోలింగ్‌ను నిర్వహిస్తున్నది. ఈ క్రమంలో ఉగ్రవాదులు ఒక్కసారిగా విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కుల్దీప్ వీరమరణం పొందారని ఓ అధికారి తెలిపారు. అయితే, ఉగ్రవాదులకు స్థానికులు సహకారం అందిస్తున్నట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు. ఇంతకు ముందు 7న ఉదంపూర్‌లోని బసంత్‌గఢ్ ప్రాంతంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ప్రతికూల వాతావరణం, పొగమంచులో ఉగ్రవాదులు తప్పించుకున్నారు. ఉదంపూర్‌లోని బసంత్‌పూర్ ఎగువన ఉన్న అటవీ ప్రాంతంలో గత కొద్దినెలలుగా ఉగ్రవాదులు దాక్కున్నట్లుగా భావిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై బలగాలకు సమాచారం అందుతున్నది. అయితే, సహాయం అందించే వారు లేకపోతే అటవీ ప్రాంతంలో ఇంతకాలం దాక్కోవడం సాధ్యం కాదని ఆర్మీ వర్గాలు భావిస్తున్నాయి. సమాచారం మేరకు ఉగ్రవాదులు స్థానికంగా ఏదో ఒక ప్రదేశంలో ఆశ్రయం పొందుతున్నారని.. ప్రస్తుతం అడవులు, పర్వతాలు గుజ్జర్, బకర్వాల్‌లో అనేక శిబిరాలు ఉన్నట్లుగా అంచనా. ఉగ్రవాదులు బెదిరింపులకు పాల్పడుతూ భోజన ఏర్పాట్లు చేసుకుంటున్నారనే అనుమానాలు సైతం ఉన్నాయి. గత ఏప్రిల్ నుంచి ఈ ప్రాంతంలో ఉగ్రవాద కదలికలపై భద్రతా బలగాలకు సమాచారం ఉన్నది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com